సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 29, మే, 2024



సోమశిలలో 7.490 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 7.490 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,,480
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.6,671
3 శాతం జీఎస్టీతో	రూ.6,871
నవర (8 గ్రా)	రూ.54,968



నిధుల గోల్‌మాల్‌పై నిరసన

చేజర్ల మండలం తిమ్మాయపాలెం పంచాయతీ నిధులు గోల్‌మాల్‌పై పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేపట్టారు. 8లో

న్యూస్‌రీల్

4న మద్యం విక్రయాల నిలిపివేత

నెల్లూరు (క్రైమ్): సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు మూసివేయనున్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మద్యం విక్రయాలకు సంబంధించి డ్రైడే అమలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను ఆదేశిస్తూ కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంటర్ పరీక్షలకు 641 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు 641 మంది గైర్హాజరయ్యారు. మంగళవారం ఉదయం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు సంబంధించి జనరల్ విద్యార్థులు 13,575 మందికి గాను 13,070 మంది హాజరయ్యారు. 505 మంది హాజరుకాలేదు. ఒకేషనల్‌కు సంబంధించి 249 మందికి 218 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు సంబంధించి జనరల్ విద్యార్థులు 1,752 మందికి 1,672 మంది హాజరయ్యారు. 80 మంది విద్యార్థులు హాజరుకాలేదు. ఒకేషనల్‌కు సంబంధించి 230 మందికి 205 మంది హాజరయ్యారు. 25 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఆర్‌ఐఓ 6, డీవీఈఓ 4, స్క్వాడ్ 31 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

నెల్లూరు (టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం జరిగిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,783 మంది హాజరుకావాల్సి ఉండగా 1,704 మంది హాజరయ్యారు. 2,079 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీఈఓ రామారావు రెండు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 12 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి.

కౌంటింగ్ ఏర్పాట్ల పర్యవేక్షణ



నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ పర్యవేక్షించారు. స్థానిక కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని మంగళవారం సందర్శించి, జరుగుతున్న ఏర్పాట్లను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ రోజు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లును నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

కౌంటింగ్.. టింగ్

ఆఖరి ఘట్టానికి కౌంట్‌డౌన్

- జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్
- 14 టేబుల్స్ 14 ఈవీఎంలు ఒక రౌండ్
- ప్రతి రౌండ్‌లో ర్యాండమ్‌గా రెండు వీవీ ప్యాట్లను ఎంపిక చేసి ఓట్ల లెక్కింపు
- తొలి ఫలితం నెల్లూరు సిటీ
- చివరి ఫలితం కోవూరు
- మధ్యాహ్నం 4 గంటలకు అన్ని నియోజకవర్గాల తుది ఫలితాలు వెల్లడి



2019 ఎన్నికల ఓట్లను కౌంటింగ్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆఖరి కీలక ఘట్టం కౌంటింగ్‌కు.. కౌంట్ డౌన్ ప్రారంభమైంది. మరో ఆరు రోజుల్లో జరగనుంది. కౌంటింగ్ ప్రక్రియకు ఎన్నికల అధికార యంత్రాంగం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. మరో వైపు అభ్యర్థులు సైతం సమర్థులైన, చురుకైన ఏజెంట్లను నియమించుకునే పనిలో తలమునకలై ఉన్నారు. ఆఖరి ఘట్టం సమీపిస్తున్న కొద్దీ అందరిలో ఉత్కంఠ నెలకొంది. నెల్లూరు జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాల ఓట్లతో పాటు నెల్లూరు పార్లమెంట్ స్థానానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం నెల్లూరు కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని సమావేశాలు నిర్వహించి కలెక్టర్, ఎస్పీలు సంసిద్ధం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 15,48,183 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తొలి ఫలితం నెల్లూరు సిటీ

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ లెక్కన కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లను బట్టి రౌండ్లు ఉంటాయి. 14 టేబుల్స్ 14 ఈవీఎంలు ఒక రౌండ్‌గా లెక్కిస్తారు. వీవీప్యాట్లలోని ఓట్ల లెక్కింపు సాయంత్రం 4 గంటలకు ముగిసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ప్రతి రౌండ్‌కు ర్యాండమ్‌గా రెండు వీవీ ప్యాట్లను ఎంపిక చేసి అందులోని ఓట్ల స్లిప్‌లతో ఆ ఈవీఎంల్లో పోల్ అయిన ఓట్లతో సరిపోల్చనున్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యాక జిల్లాలో తొలి ఫలితం 2 గంటలకు నెల్లూరు సిటీ నియోజకవర్గంది వెలువడనుంది. ఆఖరుగా ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాల ఫలితాలు 4 గంటలకు వెలువడనున్నాయి. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 248 ఈవీఎంలను 18 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. ఇందులో 17 రౌండ్లు పూర్తిగా, చివరి రౌండ్‌లో 10 ఈవీఎంలు లెక్కించనున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 323 ఈవీఎం ఉండగా 23 రౌండ్లు పూర్తిగా ఉంటాయి. చివరి రౌండ్‌లో ఒకే ఒక ఈవీఎం ఓట్లు లెక్కింపుతో పూర్తి కానుంది. కోవూరు నియోజకవర్గంలో 324 ఈవీఎంలు ఉండగా 23 రౌండ్లలో పూర్తిగా ఉంటే.. చివరి రౌండ్‌లో రెండు ఈవీఎం ఓట్ల లెక్కింపు చేయనున్నారు. కావలి 23 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుండగా 22 రౌండ్లు పూర్తిగా చివరి రౌండ్‌లో 6 ఈవీఎంల లెక్కింపుతో పూర్తి కానుంది. ఆత్మకూరు 20 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. కాగా 19 రౌండ్లు పూర్తిగా, చివరి రౌండ్‌లో 12 ఈవీఎంల్లో లెక్కింపు చేయనున్నారు. కందుకూరు 20 రౌండ్లలో లెక్కించనుండగా, 19 రౌండ్లు పూర్తిగా, చివరి రౌండ్‌లో 5 ఈవీఎంలు ఉంటాయి. ఇక నెల్లూరురూరల్, సర్వేపల్లి 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపును పూర్తి చేయనున్నారు. ఇందులో నెల్లూరు రూరల్ ఓట్లను 20 రౌండ్లలో పూర్తిగా, చివరి రౌండ్‌లో 5 ఈవీఎంల లెక్కింపుతో పూర్తి కానుంది. సర్వేపల్లి ఓట్లను 20 రౌండ్లలో పూర్తిగా, చివరి రౌండ్‌లో 4 ఈవీఎంల ఓట్లతో లెక్కింపును పూర్తి చేయనున్నారు. భౌగోళికంగా తిరుపతి జిల్లా పరిధిలోని వెంకటగిరి నియోజకవర్గంలో సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. ఈ మూడు మండలాల ఓట్లు కూడా ఇక్కడే లెక్కించనున్నారు. ఈ మూడు మండలాలకు సంబంధించి 143 ఈవీఎంలను 11 రౌండ్లలో పూర్తి చేయనున్నారు. 10 రౌండ్లలో పూర్తిగా చివరి రౌండ్‌లో 3 ఈవీఎంల ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ముగియనుంది.

జిల్లాలో ఓటు హక్కు వినియోగం

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	1,01,233	1,02,394	10	2,03,637
కావలి	97,916	1,00,140	10	1,98,066
ఆత్మకూరు	88,854	90,974	1	1,79,829
కోవూరు	1,03,088	1,08,879	9	2,11,976
నెల్లూరు సిటీ	84,423	87,314	26	1,71,763
నెల్లూరురూరల్	93,005	97,313	6	1,90,324
సర్వేపల్లి	95,962	98,651	5	1,94,618
ఉదయగిరి	99,413	98,554	3	1,97,970
మొత్తం	7,63,894	7,84,219	70	15,48,183

ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

ఈ దఫా పోస్టల్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రత్యేకంగా చేపడుతున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా టేబుల్స్, కౌంటింగ్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. ఆ పార్టీల తరఫున కూడా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకోవాల్సి ఉంటుంది. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్స్ వేర్వేరుగా లెక్కించనున్నారు. ఇందు కోసం ప్రతి నియోజకవర్గానికి రెండు టేబుళ్లు ఏర్పాటు చేయగా, గరిష్ఠంగా నెల్లూరురూరల్‌కు 6 టేబుళ్లు అధికారులు కేటాయించారు. నెల్లూరు పార్లమెంట్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలు

నియోజకవర్గం	ఉద్యోగులు	85+ హోమ్ ఓట్లు	దివ్యాంగ ఓట్లు	మొత్తం ఓట్లు
నెల్లూరు పార్లమెంట్	22,618	731	618	23,967
కందుకూరు	2,566	62	61	2,689
కావలి	3,457	78	100	3,635
ఆత్మకూరు	2,791	167	173	3,131
కోవూరు	3,081	51	78	3,210
నెల్లూరు సిటీ	2,923	104	44	3,071
నెల్లూరు రూరల్	5,139	173	93	5,405
ఉదయగిరి	2,662	96	69	2,827
సర్వేపల్లి	1,604	139	135	1,878
మొత్తం	24,223	870	753	25,846

లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. రోజువారి తనిఖీల్లో భాగంగా మంగళవారం కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించేందుకు వచ్చిన తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన అభ్యర్థులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కౌంటింగ్ కేంద్రంలో చేపడుతున్న కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 7 గంటలకు స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించుకోవచ్చునని, సీసీ టీవీల నుంచి కూడా స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించుకునే సదుపాయం కల్పించినట్లు వారికి తెలిపారు. కలెక్టర్ వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ వీరాంజనేయ రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్‌గా కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం. హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): జూన్ 4వ తేదీ జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఆన్‌లైన్ విధానంలో సిబ్బందిని కేటాయిస్తూ మొదటి విడత కౌంటింగ్ సిబ్బంది, ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ నిర్వహించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో అన్ని నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో ఆన్‌లైన్‌లో కౌంటింగ్ సిబ్బంది కేటాయింపునకు సంబంధించి మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ లవన్న, ఎన్‌ఐసీ జిల్లా సమాచార అధికారి సురేష్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- కేంద్రంలోకి ఇతరులకు అనుమతి లేదు
- నలుగురు పరిశీలకుల పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు
- ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు
- ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
- ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదు
- జిల్లా ఎన్నికల అధికారి ఎం. హరినారాయణన్



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు (పొగతోట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కట్టుదిట్టమైన బందోబస్తు, ఏర్పాట్ల మధ్య ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించేలా చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌తో కలిసి కలెక్టర్ మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు నలుగురు పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించిందన్నారు. జూన్ 4వ తేదీ నెల్లూరు పార్లమెంట్, అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ కనుపర్తిపాడులోని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని తొలుత పోస్టల్ బ్యాలెట్, 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 15,48,183 మంది ఈవీఎంల ద్వారా, 25,846 మంది పోస్టల్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. పోలైన ఓట్ల ఆధారంగా రౌండ్ల వారీగా ఓట్లు లెక్కింపు జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల్లోపు ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఇతరులకు అనుమతి లేదు

ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఇతరులకు అనుమతి లేదని, కేవలం అభ్యర్థులు, ఏజెంట్లు, ఓట్ల లెక్కింపు సిబ్బంది, అధికారులకు మాత్రమే అనుమతి ఉందన్నారు. కనుపర్తిపాడు జెడ్పీ స్కూల్‌లో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా ఏజెంట్లు, సిబ్బందిని తీసుకెళ్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకువెళ్లడానికి అనుమతి లేదన్నారు. సెల్ ఫోన్ల డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల వద్ద మీడియా సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. సెల్‌ఫోన్ల ద్వారా రికార్డింగ్ చేయడానికి అనుమతి లేదన్నారు.

1వ తేదీ లోగా ఏజెంట్ల దరఖాస్తులు ఇవ్వాలి

జూన్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఏజెంట్ల కోసం అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలన్నారు. 4న ఉదయం 8 గంటల్లోపు ఏజెంట్ల మార్పునకు అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత ఏజెంట్ల మార్పు కుదరదన్నారు. ఒక సారి ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అనుమతించిన తర్వాత ప్రక్రియ పూర్తయిన తర్వాతే బయటకు వెళ్లడానికి అనుమతి ఉంటుందన్నారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ర్యాలీలు, డీజేలు, టపాసులు పేల్చడం తదితర వాటికి అనుమతులు లేవన్నారు. ఎన్నికల నియమావళిని తప్పకుండా అందరూ పాటించాలన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి గొడవలు జరగకుండా అనుమానం ఉన్న వారిని ముందస్తు బైండోవర్ చేశామన్నారు. నేర చరిత్ర ఉన్న వారినే కాకుండా అనుమానం ఉన్న వారిని కూడా బైండోవర్ చేసుకున్నామని తెలిపారు. పోలింగ్ రోజు ఎటువంటి బందోబస్తు ఏర్పాటు చేశామో అదే విధమైన చర్యలు ఓట్ల లెక్కింపునకు చేపట్టామన్నారు. అన్ని ప్రాంతాల్లో బందోబస్తు ఉంటుందన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కాసుల వేటలో 'ఖాకీ'

ఆయనొక పోలీస్ అధికారి. విధి నిర్వహణ కంటే.. కాసుల వేటకే అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. తాను పని చేసిన ప్రతి స్టేషన్‌ను అవినీతికి అడ్డాగా మార్చేస్తారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతల అండదండలతో పబ్బం గడుపుకునే ఆయన ఎన్నికల వేళ స్వతంత్ర ప్రతిపత్తి పేరుతో అక్రమాలతో చెలరేగిపోయారు. ఆ పార్టీ.. ఈ పార్టీ అనే తేడా లేకుండా భారీగానే వెనుకేశారు. నిత్యం ఆయన దృష్టి అంతా ఇసుక, గ్రావెల్ రవాణా వాహనాలపైనే ఉంటుంది. రెండు రోజుల క్రితం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను నిలబెట్టి బహిరంగంగానే బేరం పెట్టిన వైనంపై ఇప్పుడు పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

- అవినీతికి అడ్డాగా కొడవలూరు స్టేషన్
- రెండు ఇసుక టిప్పర్లకు రూ.1.10 లక్షల వసూలు
- ఎన్నికల వేళ రూ.50 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం



కోవూరు : ఆ పోలీస్ స్టేషన్‌కు ఆయనే బాస్. ఆయన పనిచేసే స్టేషన్‌లో కేసుల కంటే.. కాసుల లావాదేవీలే ఎక్కువగా ఉంటాయనే ఆరోపణలు ఉన్నాయి. క్రిమినల్ కేసుల్లోనే కాక.. సివిల్ కేసుల వివాదాల్లో తలదూర్చి మధ్యస్తాలు చేసి ఇరుపక్షాల నుంచి బాగానే గుంజుతున్నట్లు సమాచారం. ఆయన స్టేషన్ పరిధి.. కనుచూపు దాటి ఇసుక, గ్రావెల్ వాహనం దాటిపోదంటే అతిశయోక్తి లేదు. ఆ వాహనాలు ఆ స్టేషన్ దాటి పోవాలంటే.. నెలవారీ మామూళ్లు ఇవ్వాల్సిందే.. లేదంటే స్టేషన్ బయట తుప్పు పట్టి పోవాల్సిందే. విధి నిర్వహణలో నిర్లక్ష్యం.. బాధ్యతారాహిత్యం.. అవినీతి ఆరోపణలపై ఇప్పటికే తొమ్మిది చార్జ్ మెమోలు అందుకున్నారంటే ఆయనెంతటి నిజాయితీ అధికారినో అర్థం చేసుకోవచ్చు.

నిలబెట్టి వసూలు

చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై ఉండే కొడవలూరు పోలీస్‌స్టేషన్.. గత కొంత కాలంగా అవినీతికి అడ్డాగా మారింది. ఆ స్టేషన్ అధికారి వద్ద చాటుమాటు బేరాలు ఉండవ్.. అంతా బహిరంగంగానే ఉంటాయని ఆ స్టేషన్‌లో పనిచేసే సిబ్బందే చెబుతుంటారు. అనుమతులు, బిల్లులతో గ్రావెల్, ఇసుక తరలించుకోవాలన్నా.. ఆయనకు నెలవారీ మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే. ఇసుక, గ్రావెల్ తరలించే లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు కోసం స్టేషన్‌లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకుని దందాలు కొనసాగిస్తున్నారు. వసూలు చేసిన నగదులో సిబ్బందికి సైతం ఒక్క రూపాయి ఇవ్వకుండా మొండిచేయి చూపడంతో వారు బయట పడలేక లోలోన మదనపడుతున్నారు.

రెండు టిప్పర్లు.. రూ.1.10 లక్షలు

ఎన్నికల వేళ ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం అనుమతులు నిలిపివేసింది. ఈ క్రమంలో ఇసుక అక్రమ రవాణా కొంత పెరిగింది. ఇదే అదనుగా సదరు పోలీస్ అధికారి నిత్యం రేయింబవళ్లు జాతీయ రహదారిపై కాపు కాసి కేసుల పేరుతో కాసుల వేట సాగించారు. తాజాగా ఆదివారం విడవలూరు మండలం ముదివర్తి ఇసుక రీచ్ నుంచి రెండు టిప్పర్లు సామర్థ్యానికి మించి ఇసుక లోడ్‌తో ఒంగోలు వైపు బయలుదేరాయి. ఆ రెండు టిప్పర్లను హైవేలో సదరు అధికారి నిలబెట్టారు. సరైన పత్రాలు చూపలేదంటూ వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి వరకు ఇసుక యజమానులను అక్కడ ఉంచారు. అందరూ ముందు లారీ ఓనర్లతో బేరం సాగించారు. రెండు టిప్పర్లకు కలిపి రూ.1.10 లక్షల ముట్ట చెప్పేలా ఒప్పందం కుదుర్చుకొన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికల వేళ 'పచ్చ'పాతం

సదరు పోలీస్ అధికారి గతంలో బుచ్చిరెడ్డిపాళెంలో పని చేసినప్పుడు అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు సందర్భాల్లో పోలీస్ ఉన్నతాధికారుల నుంచి చార్జ్ మెమోలు అందుకున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీలో ఉండి.. ప్రస్తుతం టీడీపీలోకి వెళ్లిన నెల్లూరుకు చెందిన తన సామాజిక వర్గానికి సంబంధించిన ఓ నేత అండతో బుచ్చిరెడ్డిపాళెం నుంచి కొడవలూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఎన్నికల వేళ సదరు నేతతో మిలాఖత్ అయి అడుగడుగునా 'పచ్చ' పాతం చూపించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందు కోసం టీడీపీ అభ్యర్థి నుంచి కోవూరు నియోజకవర్గంలో పనిచేసే పోలీస్ అధికారులకు భారీగానే ముడుపులు అందించినట్లు జిల్లా పోలీస్‌శాఖలో ప్రస్తుతం చర్చ నడుస్తోంది. స్టేషన్ స్థాయి అధికారికి రూ.3 లక్షలు, సర్కిల్ అధికారికి రూ.5 లక్షల వంతున టీడీపీ నేతల ద్వారా ముడుపులు అందించి ఎన్నికల్లో ఆ పార్టీకి అనుకూలంగా పని చేయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకూరుపేట, విడవలూరు మండలాల్లో మత్స్యకార గ్రామాల్లో అసాంఘిక దురాచారం అయిన 'దురాయి' ని టీడీపీ వేయించినా.. ఎటువంటి చర్యలు చేపట్టలేదనే ఆరోపణలకు ముడుపుల వ్యవహారమే అని అర్థమవుతోంది. తాను కూడా పనిలో పనిగా దాదాపు రూ.50 లక్షలు వెనుకేసినట్లు పోలీస్ వర్గాల విశ్వసనీయ సమాచారం.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 320



ఉదయగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ఠ ధర రూ. 320 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 497 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 452 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 45 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ఠ ధర రూ. 320, కనిష్ఠ ధర రూ. 205 పలకగా, సగటున కిలో పొగాకుకు రూ. 284.22 లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 696 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 696 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 778 బేళ్లు రాగా వాటిలో 696 పొగాకు బేళ్లను విక్రయించినట్లు తెలిపారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 87,209 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,38,82,835 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ఠంగా రూ.320, కనిష్ఠంగా రూ.205 ధర లభించింది. సగటున రూ.273.86 ధర నమోదైంది. వేలంలో 23 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫ్యాన్ గుర్తుకు ఓటేసినందుకు వ్యక్తిపై దాడి


గాయపడిన ప్రదీప్

ఆత్మకూరు: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో టీడీపీ నాయకులు గొడవలు సృష్టిస్తున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేశానని చెప్పినందుకు రెచ్చిపోయి ఆ వ్యక్తిపై టీడీపీ నాయకుడు దాడి చేసిన ఘటన ఆత్మకూరు మండలం మురగళ్ల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. బాధితుడు, పోలీసుల వివరాల మేరకు.. మురగళ్ల గ్రామానికి చెందిన దొడ్ల ప్రదీప్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచాడు. ఈ క్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కుమారుడు పచ్చా శ్రీకాంత్ మంగళవారం రాత్రి దొడ్ల ప్రదీప్‌ను మాట్లాడేందుకు పిలిచాడు. రచ్చబండ వద్ద మాటల మధ్యలో ప్రదీప్ తాను ఫ్యాన్ గుర్తుకు ఓటేశానని చెప్పాడు. దీంతో వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తొలుత రాయితో ప్రదీప్‌ను శ్రీకాంత్ గాయపరిచాడు. అనంతరం తన వెంట తెచ్చుకున్న చాకుతో ప్రదీప్ ముఖంపై చెక్కాడు. అతను కేకలు వేయడంతో శ్రీకాంత్ పరారయ్యాడు. స్థానికులు గమనించి ప్రదీప్‌ను వెంటనే ఆత్మకూరులోని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేయించారు. సీఐ జి.వేణు, ఎస్సై కె.ముత్యాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడిని చికిత్స నిమిత్తం ఆత్మకూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్ట్రాంగ్ రూమ్‌కు పోస్టల్, సర్వీస్ ఓట్లు

కందుకూరు: సర్వీస్, అంతర జిల్లాల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచామని సబ్‌కలెక్టర్ విద్యాధరి తెలిపారు. మంగళవారం ఆమె వివరాలు వెల్లడించారు. అంతర్ జిల్లాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఈనెల 11వ తేదీన స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించామని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు విషయాన్ని తెలియజేశామని వివరించారు. నియోజకవర్గంలో 66 సర్వీస్ ఓట్లు ఉండగా క్రమంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 32 మంది ఓటు వేశారని, తమకు అందిన వాటిని రాజకీయ పార్టీల ఏజెంట్ల సమయంలో స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తున్నామన్నారు. పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని వివరించారు.

జొన్నవాడలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


పూజలు చేస్తున్న వేదపండితులు

కోవూరు: బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో ఉన్న మల్లికార్జున సమేత కామాక్షితాయి వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, గిరికృష్ణ, ఉభయకర్తలు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దర్యాప్తు

నెల్లూరు(క్రైమ్): ఏటీఎంలో నగదు దోపిడీ కేసులో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం ఏటీఎం కేంద్రంతోపాటు సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీలను, ఘటన జరిగిన సమయంలో సెల్‌ఫోన్ టవర్ డంప్‌ను సేకరించారు. నిందితులు ఘటనా స్థలంలోనే గ్యాస్ సిలిండర్లను వదిలి వెళ్లడంతో దాని ఆధారంగా దర్యాప్తును సాగిస్తున్నారు. ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచారు.

వస్త్ర దుకాణంలో చోరీ

సీతారామపురం: గుర్తుతెలియని వ్యక్తులు చీరలను చోరీ చేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తిప్పిలి రమణమ్మ అనే మహిళ మసీదు ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో చీరల వ్యాపారం నిర్వహిస్తోంది. అలాగే ఆ ఇంటి ముందు మందుల షాపు కూడా నడిపుతోంది. ఆమె రెండు రోజుల నుంచి దుకాణం తెరవలేదు. మంగళవారం తెరిచేందుకు వెళ్లగా కిటికీ మెష్ తొలగించి ఉండటాన్ని గమనించింది. వెంటనే తాళం తెరిచి లోపలికి వెళ్లి చూడగా సుమారు రూ.60 వేల విలువైన చీరలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై అనూష ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- సీతారామపురంలో ఇటీవల చోరీలు అధికమయ్యాయి. గతంలో నారాయణప్పపేట అంగన్‌వాడీ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. అదే ప్రాంతంలోని ఓ గుడిలో ఉన్న హుండీలు పగులగొట్టి నగదు దోచుకెళ్లారు. తాజాగా బస్టాండ్ సెంటర్‌లో చీరలు చోరీ అయ్యాయి. పోలీసులు రాత్రి గస్తీని పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు ముమ్మరం


స్వాధీనం చేసుకున్న వాహనాల వద్ద నవాబుపేట ఇన్‌స్పెక్టర్, సిబ్బంది


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

- 67 వాహనాలు, 48 మద్యం బాటిళ్ల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): కార్డన్ సెర్చ్‌లో భాగంగా సమస్యాత్మక, శివారు ప్రాంతాలను పోలీసులు జల్లెడ పడుతున్నారు. సరైన పత్రాల్లేని వాహనాలు, అక్రమ మద్యం నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గర పడుతుండటంతో తనిఖీలు మరింత విస్తృతం చేశారు. మంగళవారం తెల్లవారుజామున నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలోని జనార్దనరెడ్డికాలనీ, భగత్‌సింగ్ కాలనీల్లో ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీ తన సిబ్బందితో కలిసి ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అదేక్రమంలో కావలి ఒకటో పట్టణం, సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, కలిగిరి, కొండాపురం, వరికుంటపాడు, ఉలవపాడు, ఆత్మకూరు, దగదర్తి, విడవలూరు పోలీసు అధికారులు స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రతి ఇంటితోపాటు గడ్డివాముల్లోనూ సోదాలు చేశారు. ఇంట్లో ఎవరెవరు ఉంటున్నారు? ఏం చేస్తున్నారు? తదితర వివరాలను సేకరించారు. వారి ఆధార్‌కార్డులను పరిశీలించారు. సరైన పత్రాలు లేని మోటార్62 బైక్‌లు, ఐదు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా నిల్వ చేసిన 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఓట్ల లెక్కింపు వేళ అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ప్రజలను హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు సూచించారు.

సెలూన్ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు

- దాడులు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): సెలూన్ ముసుగులో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దాడులు చేశారు. వారి కథనం మేరకు.. గుంటూరుకు చెందిన మౌనిక నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో రెండు నెలల క్రితం ఎస్ఎంఎస్ పేరిట సెలూన్ సెంటర్ ప్రారంభించారు. ఈక్రమంలో నిర్వాహకురాలు తనకు పరిచయమున్న తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన ఓ యువతిని ఒప్పంద ప్రాతిపదికన నెల్లూరుకు తీసుకొచ్చింది. ఆమె చేత సెలూన్‌లో క్రాస్ మసాజ్ చేయిస్తూ సొమ్ము చేసుకోసాగింది. దీనిపై మంగళవారం దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్‌కు పక్కా సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి సెలూన్ సెంటర్‌పై దాడి చేశారు. నిర్వాహకురాలితోపాటు నవాబుపేటకు చెందిన విటుడు ప్రణయ్‌ను అరెస్ట్ చేశారు. సెక్స్ వర్కర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకురాలి భర్తకు ఇందులో ప్రమేయం ఉందని పోలీసుల విచారణలో వెల్లడవడంతో అతడిపై సైతం కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

గతంలోనూ దాడులు

కొందరు వ్యక్తులు ఎదుటి వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని యువతులతో క్రాస్ మసాజ్ చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ఒప్పంద ప్రాతిపదికన యువతులను పిలిపించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారు. నెల్లూరు నగరంలో పదుల సంఖ్యలో స్పా, సెలూన్లు, బ్యూటీపార్లర్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం క్రాస్ మసాజ్ చట్ట విరుద్ధం. అయితే కొన్నిచోట్ల ఇది యథేచ్ఛగా సాగుతోందని ప్రచారం ఉంది. గతంలో మాగుంట లేఅవుట్, బ్రహ్మానందపురం, మినీబైపాస్ రోడ్డులోని పలు స్పా, బ్యూటీపార్లర్లలో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం సాగుతోందని పోలీసులకు సమాచారం అందడంతో వాటిపై దాడులు చేశారు. నిర్వాహకులతోపాటు విటులను అరెస్ట్ చేశారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు బ్రేక్ పడింది. అయితే ప్రస్తుతం పోలీసుల నిఘా అరకొరగా ఉండడంతో విష సంస్కృతి తెరపైకి వస్తోంది. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిధుల గోల్‌మాల్‌పై గ్రామస్తుల నిరసన


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చేజర్ల: మండలంలోని తిమ్మాయపాళెం పంచాయతీ ఉలవపల్లి గ్రామంలో సుమారు రూ.7 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళిపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారంటూ మంగళవారం ఆ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గ్రామసభను అడ్డుకున్నారు. నిధుల గురించి చెప్పాలని చంద్రమౌళిని నిలదీశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ టీడీపీ సర్పంచ్ గోపిదేసి అరుణ, పంచాయతీ కార్యదర్శి నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. అభివృద్ధి కోసం జనరల్ ఫండ్, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సుమారు రూ.7 లక్షలను వివిధ పనులకు ఖర్చు చేసినట్లుగా రికార్డుల్లో రాసి గోల్‌మాల్ చేశారన్నారు. పూర్తి వివరాలు చెప్పకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. చంద్రమౌళి మాట్లాడుతూ నిధులను గ్రామ నేతలకే అందజేశానని వెల్లడించారు. ఈ విషయమై డివిజనల్ పంచాయతీ అధికారి దాసరి నారాయణ మాట్లాడుతూ ఉలవపల్లి పంచాయతీలో నిధుల గోల్‌మాల్ విషయం తన దృష్టికి రాలేదన్నారు. వివరాలు తెలుసుకుని పరిశీలిస్తానని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- నగర, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి, చిత్రంలో ట్రెయినీ డీఎస్పీ హేమలత

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల ఫలితాల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, పి.వీరాంజనేయరెడ్డి హెచ్చరించారు. జూన్ నాలుగో తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలను వారు నెల్లూరులోని నగర డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం వెల్లడించారు. జూన్ ఆరో తేదీ వరకు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుంపులుగా రోడ్లపై ఉండరాదన్నారు. ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు, ట్రబుల్ మాంగర్స్ కదలికలపై నిఘా ఉంచామన్నారు. కౌంటింగ్ రోజున అనవసరంగా రోడ్లపైకి వచ్చి అల్లర్లకు కారకులై క్రిమినల్ కేసుల్లో ఇరుకోవద్దని ప్రజలకు, రాజకీయ పార్టీల నేతలకు తెలియజేశారు. ప్రజలు సంయమనంతో మెలగాలని, ఎన్నికల వేళ తలెత్తే అలజడులు కేవలం తాత్కాలికమని వాటి కోసం స్నేహాల్ని, బంధుత్వాలను విచ్ఛిన్నం చేసుకోరాదన్నారు. కేంద ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏ పార్టీ గెలిచినా విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చేందుకు అనుమతులు లేవన్నారు. పెట్రో, డీజిల్ లూజు విక్రయాల చేయరాదని పెట్రోల్ బంకు యజమానులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, ఇతరులు ఈసీ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పోలీసు హెచ్చరికలను అతిక్రమించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీషీట్‌లు తెరుస్తామని హెచ్చరించారు. సమావేశంలో ట్రెయినీ డీఎస్పీ హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఐదుకు చేరిన మృతుల సంఖ్య


నీరజ (ఫైల్)

ఇందుకూరుపేట: తిరుపతి జిల్లా చంద్రగిరిలోని ఏ కొంగరవారిపల్లిలో నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు భార్య నీరజ (34) పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతిచెందింది. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది. శ్రీనివాసులును తిరుపతి రుయా నుంచి నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. శేషయ్య, జయంతిల మృతదేహాలకు నరసాపురంలో అంత్యక్రియలు నిర్వహించారు. నీరజ మృతదేహం తిరుపతిలో ఉండిపోయింది. ఒకే కుటుంబంలో పెను విషాదం చోటు చేసుకోవడం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. అలాగే సమీర్ అంత్యక్రియలు గంగపట్నంలో జరిగాయి. అతని మృతిని జీర్ణించుకోలేక కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. శ్రీనివాసులు అత్త, నీరజ తల్లి పద్మమ్మకు మనుబోలులో అంత్యక్రియలు జరిపినట్లు బంధువులు తెలిపారు. తల్లి చనిపోవడం, తండ్రి తీవ్రగాయాలతో వైద్యశాలలో ఉండడంతో వారి పిల్లలు ప్రియ, గౌతమ్‌ను చూసిన వారందరూ కంటతడి పెట్టారు. ప్రియ ఈ ఏడాది పదో తరగతిలో మంచి మార్కులు సాధించింది. గౌతమ్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వీరికి దిక్కెవరంటూ బంధువులు రోదిస్తున్నారు.

పొదలకూరులో విషాదఛాయలు


పొదలకూరు: చంద్రగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. దీంతో పొదలకూరు పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో చనిపోయిన శేషయ్య, ఆయన భార్య జయంతి కొంతకాలంగా పొదలకూరు పట్టణంలో నివాసం ఉంటున్నారు. ఇక్కడే బంగారు దుకాణం ఏర్పాటు చేసుకుని జీవిస్తూ సొంతూరు ఇందుకూరుపేట మండలం నరసాపురానికి వెళ్లి వస్తూ ఉంటారు. పొదలకూరులో బంగారు దుకాణాలు దాదాపుగా శేషయ్య సామాజికవర్గానికి చెందిన వారివే. సమీప బంధువులున్నారు. కాగా ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిలో కుమార్తెకు వివాహం జరిపించగా, కుమారుడు చదువుకుంటున్నాడు. అందరితో కలివిడిగా మెలిగే శేషయ్య అర్ధాంతరంగా మృతిచెందడాన్ని ఆయన బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. సంతాప సూచికంగా గోల్డ్‌స్మిత్ అసోసియేషన్ నిర్ణయం మేరకు మంగళవారం పట్టణంలో బంగారు దుకాణాలను మూసివేశారు. ఈ సందర్భంగా మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. శేషయ్య దంపతుల అంత్యక్రియలకు ఆయన సమీప బంధువులు నరసాపురం తరలివెళ్లారు.

కండలేరులో 6.669 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.669 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.62
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	154
లేయర్ (లైవ్)	120
బ్రాయిలర్ చికెన్	270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	300
లేయర్ చికెన్	204

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ

- రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ కోరారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాల్లో నెల్లూరు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన పలువురు అభ్యర్థులు, ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుందని, రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ముందుగానే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థి, ఎలక్షన్ ఏజెంట్ వాహనాలకు మాత్రం ప్రత్యేక పాసులు జారీ చేసి కౌంటింగ్ కేంద్రం ముందు 100 మీటర్ల వరకు వాహనాలను అనుమతిస్తామని చెప్పారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు అల్పాహారం, భోజనం వంటి అన్ని సౌకర్యాలను కేంద్రంలోనే కల్పిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. నెల్లూరు పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు నాలుగు రౌండ్లు జరుగుతుందని, ప్రియదర్శిని కళాశాల సౌత్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో 14 టేబుల్స్‌ల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఏడు సెగ్మెంట్లకు సంబంధించి ఈవీఎంల ఓట్ల లెక్కింపు నార్త్‌బ్లాక్‌లో జరుగుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఇంకు పెన్నును తీసుకురాకూడదని చెప్పారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లను ప్రాధాన్యత క్రమంలో కూర్చునేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

పటిష్ట పోలీసు బందోబస్తు : ఎస్పీ

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలను చేయరాదని, సోషల్ మీడియాపై గట్టి నిఘా పెట్టామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై 153ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో కౌంటింగ్ రోజున ఎటువంటి గొడవలు జరగకుండా పూర్తిగా అదుపు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు, ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు పూర్తిగా సహకరించాలని కోరారు. సమావేశంలో డీఆర్‌ఓ లవన్న, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ ప్రతినిధి సుబ్బారెడ్డి, టీడీపీ ప్రతినిధి రూప్‌కుమార్, టీడీపీ నుంచి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, రసూల్, బీజేపీ నుంచి శ్రీనివాస్, కాంగ్రెస్ నుంచి బాల సుధాకర్, బీఎస్పీ నుంచి శ్రీరామ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి : ఆర్జేడీ



మాట్లాడుతున్న ఆర్జేడీ కళావతి

రాపూరు: రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆర్జేడీ డాక్టర్ కళావతి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే సింగిల్ మేజర్ సబ్జెక్ట్ హిస్టరీ, బీకామ్ కంప్యూటర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాపూరు, కోవూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్ హనుమంతరావు, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.